క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మారుతీనగర్ వద్ద రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కృష్ణచైతన్య

నరసన్నపేట: నరసన్నపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య శనివారం ప్రారంభించారు. మారుతీ నగర్ రోడ్డు అభివృద్ధికి రూ.31 లక్షలతో చేపట్టే పనులను శంకుస్థాపనరు. రూ.10 లక్షలతో చేపట్టనున్న కూరగాయల మార్కెట్ ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం అభివృద్ధి, ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షలతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. నరసన్నపేట పట్టణాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, సొసైటీ అధ్యక్షులు పొన్నాన దాలినాయుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని శిక్షించడంపై విచారణ



విద్యార్థి వీపు భాగాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

సారవకోట: మండలంలోని కిడిమి ప్రాథమికోన్నత పాఠశాలలో 4వ తరగతి విద్యార్థి రాజాపు మహేంద్రను ఆ పాఠశాల ఉపాధ్యాయుడు మార్పు అశోక్ తీవ్రంగా శిక్షించడంపై ఎంఈఓ ఎం.వి.రమణ శనివారం విచారణ చేపట్టారు. శనివారం సాక్షిలో విద్యార్థిని తీవ్రంగా శిక్షించిన ఉపాధ్యాయుడు అనే శీర్షిక వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంఈఓ పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, విద్యార్థి తండ్రి సమక్షంలో విచారించారు. విద్యార్థి వీపు దిగువ భాగం వాచి ఉండటాన్ని గమనించి వైద్యుల రిపోర్టును ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అంత తీవ్రంగా శిక్షించవద్దని, తగిన పద్ధతుల్లో విద్యా బోధన చేయాలని సూచించారు.

వీధి కుక్క స్వైరవిహారం

- ఆరుగురికి గాయాలు



గాయపడిన జాహ్నవి

మెళియాపుట్టి: మండలంలోని బాణాపురం పంచాయతీ పరిధిలోగల సుర్జిని గ్రామంలో వీధికుక్క స్వైరవిహారం చేసింది. ఈ ఘటనలో సుర్జిని గ్రామానికి చెందిన కంచరాన జానకమ్మ, ఎస్.దుర్గమ్మ, కణితి సంతు, దాసరి శ్రీహరి, పైల జాహ్నవి, జాడుపల్లి గ్రామానికి చెందిన కె.చలపతిరావు గాయపడ్డారు. వీరు చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ప్రథమ చికిత్స అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రికి వెళ్లారు. ఇటీవల వీధికుక్కల సంచారం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నేటితో దరఖాస్తులకు గడువు పూర్తి

సారవకోట: స్థానిక కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ శిరీష సూచించారు. ఆదివారంతో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగుస్తుందన్నారు. 6వ తరగతికి 40 సీట్లు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీకి 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

భార్యాభర్తలపై కేసు నమోదు

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామానికి చెందిన రెడ్డి రాజు, అతని భార్య అపర్ణపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు తెలిపారు. మండలంలోని రొంపివలస గ్రామానికి చెందిన రైతు పడాల వెంకటరావుకు చెందిన 150 ధాన్యం బస్తాలు, అదే గ్రామానికి చెందిన మరోరైతు అనకాపల్లి రాజారావుకు చెందిన 91 బస్తాల ధాన్యాన్ని రెడ్డి రాజు, అతని భార్య అపర్ణకు విక్రయించారు. ఇంతవరకు ధాన్యానికి సంబంధించిన నగదు ఇవ్వకపోవడంపై బాధిత రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భార్యాభర్తలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం



బీఆర్‌నగర్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమం కోసం నిరంతరం ఆలోచిస్తూ ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందుతున్నాయని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ గేట్ సచివాలయం పరిధిలోని గేటు బీఆర్ నగర్, చిట్టమ్మ క్వార్టర్స్, గేటు ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి ఏమేరకు చేకూరిందో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ ఆలోచన, ఆశయానికి ప్రతిరూపంగా ఉన్న గడపగడపకు మన ప్రభుత్వం ఉద్దేశాన్ని ప్రజలకు వివరించారు. అర్హులైన వారికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్న ఏకైక సీఎం జగన్ అని గుర్తుచేశారు. నిరుపేదల గౌరవాన్ని పెంచేలా ఏపీ సర్కార్ అడుగులు వేస్తుందన్నారు. సంక్షేమ పథకాలు అందకపోతే, గ్రామ సచివాలయం ద్వారా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పొడుగు శ్రీనవాసరావు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కె.శ్యామ్‌ప్రసాద్, శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ బి.వి.రమణమూర్తి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు జగనన్నకే సాధ్యం



నరసన్నపేట: ద్విచక్ర వాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- రాజకీయాల్లో ఉన్నంత వరకు సీఎం జగన్‌తోనే ఉంటా
- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: రాజకీయాల్లో ఉన్నంత వరకూ సీఎం జగన్‌మోహనరెడ్డితోనే ఉంటానని.. రానున్న ఎన్నికల్లో పోటీచేసి ఐదో సారీ గెలిచి నిరూపిస్తానని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ముగింపు సందర్భంగా నరసన్నపేట పట్టణంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ శనివారం సాయంత్రం చేపట్టారు. ఈ ర్యాలీని పైడితల్లి కూడలి వద్ద ప్రారంభించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, ముఖ్యమంత్రి జగన్ తనకు మంత్రి పదవినిచ్చి గౌరవించారన్నారు. కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పైడితల్లి ఆలయం నుంచి పాతబస్టాండ్, పల్లిపేట కూడలి మీదుగా పార్టీ కార్యాలయం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీ టాకీస్ కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. వైఎస్సార్ కూడలిలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆమదాలవలస రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని సర్పంచ్ సైలాడ దాసునాయుడు అన్నారు. సైలాడలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు పాల్గొన్నారు.



ఆమదాలవలస రూరల్: సైలాడలో సంక్షే పథకాలను వివరిస్తున్న సర్పంచ్ సైలాడ దాసునాయుడు



కొత్తూరు: ఎస్ఎస్ కాలనీలో స్టిక్కర్లు అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: మండలంలోని ఎస్ఎస్ కాలనీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వైస్సార్‌సీపీ నాయకుడు, వ్యవసాయ జిల్లా సలహా కమిటీ సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు, పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు పాల్గొన్నారు.

నేటినుంచి నీలామణి అమ్మవారి ఉత్సవాలు

హిరమండలం: శాంతి స్వరూపిణి, కోర్కెలు తీర్చే కల్పవల్లి పాతహిరమండలం గ్రామ దేవత నీలామణి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం నుంచి మే 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పన్నెండేళ్ల తరువాత జరిగే ఈ పండగల కోసం ఆలయ అభివృద్ధి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్రామంలోని అన్ని వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కుంటిభద్రలో పండగలు..

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర గ్రామంలో ఈ నెల 30 తేదీ నుంచి ఐదు రోజులపాటు చెవిటమ్మ తల్లి పండగలు నిర్వహించనున్నారు. పండగల సందర్భంగా కుంటిభద్ర పంచాయతీ పరిధిలోని గ్రామాలను విద్యుత్ ఆలంకరణలో తీర్చిదిద్దారు. సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తిచేశారు.

జమ్ములో అశిరితల్లి ఉత్సవాలు..

నరసన్నపేట: మండలం జమ్ములో ఆదివారం నుంచి అశిరితల్లి గ్రామ దేవత ఉత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం గ్రామ దేవరను తెచ్చుట, సోమవారం ఘటముల ఊరేగింపు, మంగళవారం ఘటాల అనుపు కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వహకులు తెలిపారు. ఈ అమ్మవారి పండగలు 20 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్నారు. కాగా ఈ సందర్భంగా గ్రామాన్ని, అమ్మవారి ఆలయాన్ని అలంకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొందూరు: విద్యుత్‌లైన్ల మరమ్మతు పనులు ఆదివారం చేపట్టనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ బయ్యన్నాయుడు శనివారం తెలిపారు. పొందూరు ఇండస్ట్రియల్, లోలుగు ఇండస్ట్రీయల్ ఫీడర్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం

- జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభించిన స్పీకర్ తమ్మినేని సీతారాం



పెద్దపాలెంలో జల్‌జీవన్ మిషన్ పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: అభివృద్ధే తారక మంత్రంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. మండలంలోని పాలవలసలో రూ.22.40 లక్షలు, పెద్దపాలెంలో రూ.17.10 లక్షలు, చినపాలెం గ్రామంలో రూ.9 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన తాగు నీటి కుళాయిలను శనివారం ప్రారంభించారు. నీటి వినియోగంలో జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని గుర్తుచేశారు. పాదయాత్రలో సీఎం ప్రజలకిచ్చిన మాట ప్రకారం నవరత్నాలు పేరుతో అన్ని పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. సంక్షేమం మరలా జరగాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, పార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ లావేటి అనిల్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, పెద్దపాలెం, పాలవలస సర్పంచ్‌లు సర్ధరి గురువులునాయుడు, గజ్జిన మోహనరావు పాల్గొన్నారు.

రైతుకు చేరువుగా పీఏసీఎస్‌లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: ప్రాథమిక సహకార సంఘాలు మరింత బలోపేతమై, రైతులకు కావాల్సిన రుణాలు, ఎరువులు తదితర సేవలు సకాలంలో అందించాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. అల్లాడ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడిగా మొజ్జాడ శ్యామలరావు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర విశాల ప్రయోజనాలు కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం సీఎం జగన్ గాలి వీస్తోందన్నారు. ఎంత మంది చంద్రబాబులు, పవన్ కల్యాణ్‌లు ఒక్కటైనా ఒరిగేది ఏమీ లేదన్నారు. సీఎం జగన్‌ను ఓడించేందుకు టీడీపీ కుతంత్రాలు చేస్తోందన్నారు. వీటిని ప్రజలు తిప్పికొడతారన్నారు. సొసైటీ, డీసీసీబీ సేవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు అన్నారు. పోలాకి జెడ్పీటీసీ సభ్యులు ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ వాన గోపి, డైరెక్టర్లు నడుపూరి గోవిందరావు, అల్లు దాలప్పన్న, సీఈఓ పిల్లల గిరిధర్, సర్పంచ్ బూర్లి అసిరమ్మ, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, ఎంపీటీసీ ఎం.అరుణ, ఉంగటి మురళీకృష్ణ, పైడి విఠలరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆదర్శ పాలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో అపారమైన నమ్మకం ఉందని, ఆయనతోనే తమ బంగారు భవిష్యత్తు ముడిపడి ఉందని ప్రతి ఒక్కరూ నమ్ముతున్నారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పీపుల్స్ సర్వేను చేపట్టి, ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకోగలిగామన్నారు. 22 రోజుల పాటు మహా యజ్ఞంలా మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం నిర్వహించామన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులు అందిస్తున్నామన్నారు. ప్రజా మద్దతు పుస్తకం ద్వారా ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నామన్నారు. వైద్యం, విద్యకు రాష్ట్రం ప్రభుత్వం అధికంగా ఖర్చు చేస్తుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 90 వేల ఇళ్లు ఉంటే.. అందులో 80 వేల ఇళ్లకు వెళ్లామన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రూ.265 కోట్లతో తాగు నీరును సీఎం అందించామన్నారు. రూ.700 కోట్లతో ఉద్దానం ప్రాంతంలోని ఏడు మండలాలకు తాగునీరు అందించనున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

పశుసంపద సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం



వేణుగోపాలస్వామి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పశు, జీవ సంపదలను పరిరక్షించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక కోర్టు కూడలి వద్ద ఉన్న ప్రాంతీయ పశుసంవర్థక శాఖ కార్యాలయంలో ఏడీ మంచు కరుణకరరావు ఆధ్వర్యంలో ప్రపంచ పశు వైద్యుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూగ జీవాలను రక్షించి, వాటికి సేవలందించడం గొప్ప విషయమన్నారు. పాడి బాగుంటే రైతులు బాగుంటారన్నారు. ప్రభుత్వం పశుపోషణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ముందుగా ఏడీ కార్యాలయం ఆవరణలో ఉన్న వేణుగోపాలస్వామి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, రెడ్డి రామారావు, పనుకు మోహన్, బి.నారాయణమూర్తి, వై.సూర్యం, విష్ణుమూర్తి, మీసాల రామకృష్ణ, తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, సూపరింటెండెంట్ కె.అప్పలనాయుడు, ఈఓపీఆర్డీ ప్రసాద్ పండాలు, పశువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

హిరమండలం: హిరమండలంలోని కోవెల వీధికి చెందిన శృతిమయి పాడి ఇంటర్మీడియట్ బైపీసీలో 962 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చినందుకు స్థానిక సామాజిక వేత్త సింహాద్రి కాశీప్రసాద్ రూ.10 వేల నగదును శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాలో ఉన్న తన కుమారుడు సాయిరాం గుప్తా నగదును పంపించి ప్రతిభ చాటిన పేద విద్యార్థినికి ప్రోత్సాహకం కింద అందజేయాలని చెప్పారన్నారు. సింహాద్రి రమేష్‌కృష్ణ ఉన్నారు.

15లోగా నాడు-నేడు పనులు పూర్తిచేయాలి

హిరమండలం: మండలంలో మనబడి-నాడు-నేడు ఫేజ్ 1, 2 అభివృద్ధి పనులు మే 15 తేదీ నాటికి పూర్తిచేయాలని జిల్లా సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అదనపు కోఆర్డినేటర్ జయప్రకాష్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో నాడు-నేడు పనులపై శనివారం సమావేశం నిర్వహించారు. నాడు-నేడు పథకంలో మంజూరైన అన్ని పాఠశాలలకు పూర్తిస్థాయిలో రిలీవ్ ఫండ్ విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ నిధులతో పెండింగ్‌లో ఉన్న పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఎంఈఓ కె.రాంబాబు, మండల ఇంజినీరింగ్ అధికారి కె.రామారావు, ఏపీఎం శ్రీరామచంద్రమూర్తి, సీఆర్పీలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

రాయితీపై యంత్ర పరికరాలు అందజేత

బూర్జ: డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రాయితీపై యంత్ర పరికరాలను వ్యవసాయ సహాయ సంచాలకులు బి.రాజగోపాలరావు ఆధ్వర్యంలో శనివారం రైతులకు అందజేశారు. మండలంలోని అన్నంపేట రైతు భరోసా కేంద్రం పరిధిలో టి.డి.ఆర్.రాజుపేట గ్రామానికి చెందిన చీడిపోలమ్మ తల్లి కమ్యూనిటీ హైరింగ్ సెంటర్‌కి రూ.15 లక్షలు విలువ చేసే యంత్ర పరికరాలు వచ్చాయి. వీటిని రైతులకు పంపిణీ చేశారు. పాలకొండ డీసీసీబీ బ్యాంకు ద్వారా రైతులకు అందజేసిన ట్రాక్టర్, రోటోవేటర్, వరికోత యంత్రాలు, వరి నూర్పుడి యంత్ర పరికరాలు అందజేశారు. ఏఓ వి.రాజేశ్వరరావు, బ్యాంకు మేనేజర్ పి.బాబ్జీ, సూపర్ వైజర్ జనార్దన్ నాయుడు, సి.హెచ్.సి గ్రూప్ సభ్యులు ఇప్పిలి సిమ్మన్న, ఇప్పిలి రాజు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తా

జేఈఈ మెయిన్స్ రెండో విడత ఫలితాలు శుక్రవారం రాత్రి విడదలయ్యాయి. ఆల్ ఇండియా ఓపేన్ కేటగిరిలో ఉత్తమ ర్యాంకులతో పలువురు విద్యార్థులు సత్తా చాటారు. ఆమదాలవలస పట్టణంలోని 22వ వార్డు లక్ష్మిడిపేట గ్రామానికి చెందిన మెండ హర్షవర్ధన్ ఆల్ ఇండియా ఓపెన్‌కేటగిరిలో 211వ ర్యాంకు సాధించాడు.

– సాక్షి నెట్‌వర్క్



సంచాన అజయ్ కుమార్ (3,550) పాతపట్నం



నక్క తన్మయ రాఘవ్ (1,370) నరసన్నపేట



తర్ర సాయి చరణ్ (2,629) నరసన్నపేట